నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా అరెస్టు

దశ, తాండూరు: తాండూరు కేంద్రంగా తొ నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ఓ ముఠా భాగోతం వెలుగుచూసింది. ఇంటర్నెట్ సెంటర్ నడుపుతున్న ఓ వ్యక్తి పలు మండలాల్లో ఏజెంట్లను పెట్టుకుని వారి ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఫేక్ సర్టిఫి కెట్లు, భూములకు సంబంధించి నకిలీ ఈసీలు తయారు చేసి అమాయకుల నుంచి రూ.లక్షలు దోచుకుంటు న్నాడు. ల్యాప్ టాప్ లో ఫొటో షాప్ ఆధారంగా నెట్లో ఒరిజినల్ సర్టిఫి కెట్లను డౌన్లోడ్ చేసుకొని వాటిలోని సమాచారాన్ని ఎడిట్ చేస్తూ జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తయారు చేస్తున్నాడు. ఇవి ఫేక్ అని తెలుసుకున్న చివరకు బాధితులు బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. వారు రంగంలోకి దిగి జిరాక్స్ సెంటర్ నడుపుతున్న ముఠాలోని ఓ ఏజెంట్ను అరెస్టు చేసారు.

యూరియా కార్డుల పంపిణీ

దశ, దౌల్తాబాద్: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం గొడుగుపల్లి గ్రామంలో రైతులకు అవసరమైన యూరియా కార్డులను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి తో కలిసి గ్రామ సర్పంచ్ మద్దెల వనజ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రైతుల అవసరాలను గుర్తించి ప్రభుత్వ పథకాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యూరియా కార్డుల పంపిణీతో రైతులకు ఎరువుల సరఫరా సులభంగా జరుగుతుందని, పంటల సాగుకు ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దీపిక మధుసూదన్, ఏఈఓ రజినీకాంత్,పంచాయతీ కార్యదర్శి మల్లేశం,వార్డు సభ్యులు కర్ర మహేశ్, మద్దెల భాగ్యలక్ష్మిమల్లేష్, దుర్గని నర్సింలు, సట్ట లింగం,మంత్రి కరుణాకర్, నల్ల ఆంజనేయులు,మద్దెల శ్రీకాంత్,రవి,స్వామి తదితరులున్నారు.

సీఎం రేవంత్‌ని కలిసిన పగడాల మంజుల

దశ, కారేపల్లి : తెలంగాణ రాష్ట్ర సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి ని బుధవారం హైదరాబాద్‌లో కారేపల్లి మండల మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు పగడాల మంజుల మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సర ప్రవేశం సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసిన ఆమె, వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రజా పాలన అందిస్తూ, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న ముఖ్యమంత్రి పనితీరును ఆమె కొనియాడారు. ముఖ్యంగా నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతం, స్థానిక ప్రజా సమస్యలు మరియు పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనుల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, కార్యకర్తలకు మరియు నాయకులకు ఆయన ఎల్లప్పుడూ అండగా ఉంటున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా తమ కార్యాచరణ ఉంటుందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

స్వయంభూ శంభులింగేశ్వర ఆలయ కమిటీ బాధ్యతల నుండి ఆది వేణుగోపాల్ స్వచ్ఛంద విరమణ

దశ, దౌల్తాబాద్: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ స్వయంభూ శంభులింగేశ్వర ఆలయ కమిటీ చైర్మన్‌గా 2005 సంవత్సరం నుంచి నిరంతరంగా సేవలందిస్తున్న ఆది వేణుగోపాల్ నేటి నుంచి ఆ బాధ్యతల నుంచి స్వచ్ఛందంగా వైదొలుగుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తన నిర్ణయాన్ని తెలియజేశారు.దాదాపు రెండు దశాబ్దాల పాటు ఆలయ అభివృద్ధి, పూజా విధానాల నిర్వహణ, భక్తులకు సౌకర్యాల కల్పనలో సేవలందించానన్నారు. ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేయడం తనకు గర్వకారణమని, భవిష్యత్తులోనూ ఆలయ శ్రేయస్సు కోసం సహకారం కొనసాగిస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.తన నిర్ణయాన్ని గౌరవిస్తూ భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి గ్రామస్తులంతా కలిసి పనిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కర్నాల శ్రీనివాసరావు,ముచ్చమర్రి సత్తయ్య,కౌకూరి యాదగిరి,నాగయ్య, సత్తయ్య,ఆంజనేయులు తదితరులున్నారు.

ప్రభావిత గ్రామాల అభివృద్ధికి సహకరించండి

❖ సర్పంచ్ హీరాలాల్ వినతి.

దశ, కారేపల్లి : సింగరేణి ప్రభావిత గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు కేటాయించాలని భాగ్యనగర్ తండా గ్రామ పంచాయతీ సర్పంచ్ బానోత్ హీరాలాల్ కోరారు. బుధవారం ఆయన సింగరేణి సంస్థ కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కృష్ణయ్యని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని, ప్రజల దాహార్తిని తీర్చేందుకు వాటర్ ప్లాంట్, వీధి దీపాల కోసం సోలార్ లైట్లను మంజూరు చేయాలని, సింగరేణి ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధుల ద్వారా గ్రామానికి ప్రత్యేక కేటాయింపులు చేయాలన్నారు..
గ్రామ దేవాలయాల అభివృద్ధి కోసం అవసరమైన పాత పైపులు, రేకులను సరఫరా చేయాలని కోరారు.

దీనికి సానుకూలంగా స్పందించిన జీఎం, నిబంధనల మేరకు గ్రామాభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బానోత్ రాంచందర్, గూగులోత్ బాబు, వార్డు సభ్యులు వాంకుడోత్ గాంధీ, ధరావత్ కళ్యాణ్, బానోత్ దిలీప్, గ్రామ నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు గత కొన్ని రోజులుగా 4వ వార్డులో పైప్‌లైన్ లీకేజీ కారణంగా

మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుండటాన్ని గమనించిన సర్పంచ్, వెంటనే స్పందించి మరమ్మత్తు పనులకు శ్రీకారం చుట్టారు. పంచాయతీ కార్యదర్శి అనిల్ కుమార్ తో కలిసి పనులు జరుగుతున్న తీరును, నాణ్యతను పరిశీలించారు. ఎక్కడా నీటి వృధా జరగకుండా, ప్రతి ఇంటికి సమృద్ధిగా నీరు అందేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించాలి: దేప భాస్కర్ రెడ్డి

దశ, ఎల్బీనగర్ : మహేశ్వరం నియోజకవర్గంలోని ఎన్టీఆర్ నగర్ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి హాజరై మాట్లాడారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలను ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేయాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పున్న గణేష్ నేత, చిలుక ఉపేందర్ రెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం చైర్మన్ తలాట రమేష్ నేత, నాయకులు గట్ల రవీంద్ర, ముప్పిడి లింగస్వామి గౌడ్, రామకృష్ణ గౌడ్,దుబ్బాక శేఖర్, డాక్యర్ నాయక్, జ్ఞానేశ్వర్ యాదవ్,అక్బర్, అలేటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

దౌల్తాబాద్: సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందుప్రియాల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అఫ్జల్ హుస్సేన్ పదవీ విరమణ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.అఫ్జల్ హుస్సేన్ విద్యా రంగంలో చేసిన సేవలను ఆయన ఈ సందర్భంగా కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ నిజాయితీతో విధులు నిర్వర్తించిన అఫ్జల్ హుస్సేన్ సేవలు ఆదర్శప్రాయమని అన్నారు. పదవీ విరమణ అనంతరం కూడా విద్యా రంగానికి తన అనుభవాన్ని అందించాలన్నారు. పాఠశాల పనితీరు విద్యార్థుల హాజరు,మధ్యాహ్న భోజన పథకం అమలు,బోధన విధానాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం

❖ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్.

❖ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో కలెక్టర్ కీలక ఆదేశాలు

దశ, మెదక్: గ్రామాల అభివృద్ధిలో గ్రామపంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రజావాణి హాల్ నందు జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిపిఓ యాదయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు,ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడాతు... ముందుగా గ్రామపంచాయతీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. మండల అభివృద్ధి అధికారులు ,గ్రామపంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధి లక్ష్యంగా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. పారిశుద్ధంపై ఈ నెల 8 నుంచి 11 వరకు స్పెషల్ ట్రైన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన గ్రామపంచాయతీ సర్పంచులుగా వార్డు మెంబర్లుగా బాధ్యతలు చేపట్టిన వారికి గ్రామపంచాయతీ చట్టం, గ్రామాల అభివృద్ధి పై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలలో పోటీ చేసిన సర్పంచ్ వార్డు మెంబర్ల ఎన్నికల ఖర్చు వివరాలను సమర్పించే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.. గ్రామ పంచాయతీలు

ప్రజల నుండి ఆస్తి పన్ను (ఇంటి పన్ను), లైసెన్స్ ఫీజు,బిల్డింగ్ పర్మిషన్ ఫీజు,తై బజార్ ఫీజు వంటివి వసూలు చేయడంలో లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రామపంచాయతీ యాక్టుపై నూతన సర్పంచులకు, వార్డు మెంబర్లకు స్పష్టమైన అవగాహన పై పంచాయతీ కార్యదర్శులు గైడ్ చేయాలన్నారు. గ్రామాలు పారిశుద్ధ్యం పచ్చదనంతో కళకళలాడాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమికుడు అరెస్టు

❖ అనుమానంతో ప్రియురాలికి వేధింపులు .

❖ అవమానం భరించలేక ఆత్మహత్యాయత్నం .

❖ చికిత్స పొందుతూ యువతి మృతి .

దశ, ఎల్బీనగర్: ప్రియుడు ప్రతి రోజూ అనుమానంతో వేధించడంతో అవమానం తట్టుకోలేక ప్రియురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందింది. యువతి ఆత్మహత్యకు కారణమైన ప్రియుడిని నాగోల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలు... హస్తినాపురం డివిజన్ గాయత్రి నగర్ కు చెందిన సభావత్ మహేష్ అలియాస్ ఆనంద్ (23) ఆటో డ్రైవర్ గా పని చేస్తున్నాడు. తెలంగాణ కోఆప్ హౌసింగ్ బోర్డ్ కాలనీ నాగోల్ డివిజన్ తట్టి అన్నారంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ఐశ్వర్య(19) వీరిద్దరూ రెండు ఏండ్లుగా ప్రేమించుకుంటున్నారు. తన ప్రేమ విషయాన్ని ఐశ్వర్య ఇంట్లో చెప్పి,

పెండ్లికి ఒప్పించుకున్నది. కాగా, ఇటీవల ఐశ్వర్యను నిత్యం అనుమానంతో మహేశ్ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో మహేశ్ ఈ నెల 5వ తేదీన ఐశ్వర్యను కలవడానికి వచ్చి, నువ్వు ఎవరితోనో ఫోనులో మాట్లాడుతున్నావని అనుమానం వ్యక్తం చేశాడు. ఇది తట్టుకోలేని ఐశ్వర్య పక్కనే ఉన్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ ఎక్కి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గాయపడిన ఐశ్వర్యను ముందుగా నాగోల్ లోని సుప్రజ ఆసుపత్రి, అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 7వ తేదీన(బుధవారం) తెల్లవారుజామున చనిపోయింది. ఐశ్వర్య మృతికి కారణమైన మహేశ్ ని నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసి, బుధవారం రిమాండ్ కు తరలించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన కార్యాచరణ చేపట్టాలి: జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్

దశ, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడిఓసిలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రహదారుల భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు లఘు చిత్రాలను రూపొందించి సినిమా థియేటర్లలో ప్రదర్శించాలన్నారు. అలాగే ప్రతి సంవత్సరం జనవరి నెలలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాల సందర్భంగా రోడ్డు భద్రతకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాల్సిన నియమాలపై జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుని చట్ట ప్రకారం జైలు శిక్షలు విధించేలా చర్యలు చేపట్టాలని

తెలిపారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో అవసరమైన భద్రతా చర్యలు అమలు చేయాలని ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా పోలీస్ శాఖ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ జితేష్ పాటిల్ ఆదేశించారు.

సైబర్ నేరాల పట్ల విద్యార్థి దశ నుండే చైతన్యం అవసరం

❖ జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

దశ రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ తిరుమల నర్సింగ్ హోమ్ వారి సౌజన్యంతో ముస్తాబాద్ మండల పరిధిలోని జడ్.పి.హెచ్. ఎస్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వైద్య శిబిరానికి విద్యార్థుల నుండి విశేష స్పందన లభించగా,పెద్ద సంఖ్యలో విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆరోగ్య సమస్యలపై వైద్య నిపుణులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో విద్యార్థులకు సాధారణ వైద్య పరీక్షలు,కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సూచనలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసిన శ్రీ తిరుమల నర్సింగ్ హోమ్ యాజమాన్యంతో పాటు ఇందులో పాల్గొన్న వైద్య నిపుణులు , సిబ్బందికి ,సురభి వైద్య విజ్ఞాన సంస్థ సిబ్బంది,జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఐ మొగిలి, ఎంఈఓ రాజిరెడ్డి,ఎస్.ఐ గణేష్, డాక్టర్లు చంద్రశేఖర్ రావు, శ్రీకాంత్ , అనురాధ,స్రవంతి,సురభి వైద్య విజ్ఞాన సంస్థ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.